# జాతీయ రహదారిపై బోల్తా పడిన టెంపో

## - ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలు



ఓజిలి, జూన్ 3, ప్రభాతవార్త

రాచపాలెం జాతీయ రహదారిపై టెంపో బోల్తా పడి 14 మంది టెంపోల్లో ఉండగా ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలు పాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వీరు హైదరాబాద్ ఎల్బీ నగర్ ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు తెలిపారు. డ్రైవర్ ప్రశాంత్ కుమార్ నిద్రమత్తులో జరుకోవడంతో ఓజీల రాచపాలెం వద్ద హైవే డివైడర్ను ఢీకొని టెంపుల్ బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ప్రశాంతి, అంజమ్మ, సబిత అనే ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని పోలీసులు తెలిపారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# పండ్ల అలంకారంలో గంగమ్మ

తిరుపతి, జూన్ 3ప్రభాతవార్త: తాతయ్యగుంటగంగమ్మ ఆలయంలో మంగళవారం ఆలయాన్ని పలురకాల పండ్లతో అలంకరించారు. జాతర మూడవవారంలో ఉదయం అమ్మవారిని విశేషంగా పండ్లతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు సౌకర్యాలు కల్పించారు.



# హంసవాహనంపై గోవిందరాజులు



తిరుపతి, జూన్ 3ప్రభాతవార్త:

తిరుపతిలో శ్రీగోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు మంగళవారం రాత్రి స్వామివారు హంసవాహనంపై భక్తులను కటాక్షించారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు పూర్తిచేసుకున్న తరువాత విశేష అలంకరణ భూషితుడైన గోవిందరాజస్వామిని అర్చకులు వాహనం మండపం వద్దకు వేంచేపు చేశారు. ఇక్కడ హంసవాహనంపై స్వామివారిని అధిరోహింపచేశారు. రాత్రి 7గంటలకు మాఢవీధుల్లో ఊరేగారు. వాహనం ముందు గజరాజులు, అశ్వాలు ఠీవిగా నడుస్తుండగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. ఈ వాహనసేవల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ విఆర్ శాంతి, ఎఈఓ మునికృష్ణారెడ్డి, శ్రీవారిసేవకులు, అర్చకులు పాల్గొన్నారు.

**-ఉదయం చిన్నశేషవాహనంపై:**

వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండవరోజు ఉదయం గోవిందరాజస్వామి ఉభయనాంచారులతో కలసి చిన్నశేష వాహనంపై ఊరేగారు.ఐదుతలల చిన్నశేషుడు వాసుకిగా భావిస్తారు. శేషవాహనాన్ని దర్శిస్తే దుష్టశక్తుల వల్ల కలిగే దుష్ఫలితాలు తొలగి భక్తులకు కుండలినీయోగ సిద్ధించి సుఖశాంతులతో ఆనందజీవులవుతారని విశ్వాసం.

# కన్నుల పండువగా రథోత్సవం



యాదమరి, జూన్ 3 ప్రభాతవార్త:

యాదమరి శ్రీవరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం రంగ రంగ వైభవంగా ముగిసింది. యాదమరి త్రివేణి సంగమంలో వెలసిన శ్రీ భూదేవి శ్రీదేవి సమేత వరదరాజులస్వామి రథంపై యాదమరి మాడ వీధుల్లో కలియతిరిగారు. యాదమరి రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ రథోత్సవ కార్యక్రమానికి యాదమరి, పరిసర గ్రామ ప్రజలతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై రథోత్సవంతో పాల్గొన్నారు. రథంపై బొరుగులు, మిరియాలు చల్లితే కోరిన కోరికలు తీరుతాయని నమ్మకం వుండటంతో అత్యధిక భక్తులు రథంపై ఆశీనులైన వరదరాజస్వామిపై బొరుగులు, మిరియాలు చల్లి కోరికలు కోరుకున్నారు. ఉదయం వేదపండితులు మూలవర్లకు పుష్ప కైకర్యాలు నిర్వహించి అభిషేకం అనంతరం స్వామి వారిని భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వాముల వారిని రథోత్సవంలో ఆశీనులు చేసి మాడవీధుల్లో కలయ తిప్పారు. రాత్రి స్వామి వారికి తేరు మెట్ల ఉత్సవం నిర్వహించారు. వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# అప్పలాయగుంటలో ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



వడమాలపేట, జూన్ 3 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 6 నుంచి 15 తేదీ వరకు జరగనున్నాయి. జూన్ 6న సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. మంగళవారం వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రధాన అర్చకులు సూర్యకుమార్ ఆచార్యులు, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, అర్చక బృందం టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

# తోతాపురి టన్ను రూ.12 వేలు

## - మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యాజమానులతో చర్చించి నిర్ణయించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త:

తోతాపురి రకం మామిడి ఈ సీజన్‌లో ఒక టన్ను ధర 12 వేల రూపాయలుగా కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్ణయించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎమ్మెల్యేలు గురజాల జగ్మోహన్ నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమల యాజమానులతో తోతాపురి రకం మామిడి ధర నిర్ణయంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, మామిడి గుజ్జు పరిశ్రమల యాజమానులతో తోతాపురి ధరపై మాట్లాడారు. మామిడి రైతుల, గుజ్జు పరిశ్రమల యాజమానులతో సుదీర్ఘ చర్చల అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఈ సీజన్‌కు తోతాపురి రకం మామిడి టన్ను ధర 12 వేల రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని ప్రకటించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా తోతాపురి మామిడి పంట వుందని, మామిడికి గిట్టుబాటు ధరకు సంబంధించి మామిడి రైతులు, మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాలనులు తమ సమస్యలను వారు చెప్పడం జరిగిందన్నారు. ఇటు మామిడి రైతులు, అటు మామిడి గుజ్జు పరిశ్రమల యాజమానులు ఇద్దరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా తోతాపురి రకం మామిడి ధర టన్ను 12 వేల రూపాయలుగా ఖరారు చేయడం జరిగిందన్నారు. మామిడి రైతుల గురించి గుజ్జు పరిశ్రమల యాజమానులు ఆలోచించాలని, రైతుల నుండే మామిడి కొనుగోలు చేయాలని గుజ్జు పరిశ్రమల యాజమానులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ తోతాపురి మామిడి రకానికి గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, రైతులతో పాటు ప్రాసెసింగ్ పరిశ్రమల వారు పరిశ్రమలను నిర్వహించడానికి అనుగుణంగా ఇద్దరికి సామరస్యంగా వుంటుందని మామిడి టన్ను 12 వేల రూపాయలుగా కలెక్టర్ నిర్ణయించడం జరిగిందన్నారు. ఇటు యాజమానులు, అటు రైతులు ఇద్దరు బాగుండాలని ప్రభుత్వ ఉద్దేశమన్నారు. జిల్లాలో ఎక్కువ పరిశ్రమలు తీసుకురావడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. తమిళనాడు ప్రభుత్వంతో కూడా మామిడి రైతుల గిట్టుబాటు ధరపై చర్చించడం జరుగుతుందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి సాగు ఎక్కువగా వుందని, ప్రధానంగా ప్రాసెసింగ్‌కు అవసరమైన తోతాపురి రకం ఎక్కువగా వుందన్నారు. జిల్లాలో మామిడి పరిశ్రమలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతులకు పరిశ్రమల నుండి ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాజమానులు చూడాలన్నారు. రైతులు సైతం మామిడి పరిశ్రమల యాజమానులకు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో మామిడి గుజ్జు పరిశ్రమల యాజమానులు మాట్లాడుతూ పరిశ్రమల నిర్వహణలో వున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలోని ప్రాసెసింగ్ యూనిట్లలో ఇప్పటికే ఎక్కువగా మామిడి గుజ్జు నిల్వ వున్నదని, మామిడి గుజ్జుకు ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ తగ్గిందన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల నుండి ఉద్యానశాఖ డిడిలు మధుసూధన్‌రెడ్డి, దశరధరెడ్డి, రైతు సంఘ నాయకులు, మామిడి గుజ్జు పరిశ్రమల యాజమానులు, తదితరులు పాల్గొన్నారు.



తోతాపురి రకం మామిడి గిట్టుబాటు ధరపై రైతులు, ఫ్యాక్టరీ యాజమానులతో సమావేశమైన కలెక్టర్, ఎమ్మెల్యేలు.

# వెన్నుపోటు దినం విజయవంతం చేద్దాం..!

## చంద్రబాబు హామీలు..లోకేశ్ రెడ్‌బుక్‌పై నిలదీద్దాం..!

## ఉమ్మడి చిత్తూరు వైసిపి జిల్లా భూమన కరుణాకర్ రెడ్డి



చంద్రగిరి, జూన్ 3 ప్రభాతవార్త:

వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని వైసిపి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక నాగాలమ్మ మలుపు వద్ద గల ఓ కల్యాణ మండపంలో మంగళవారం వైసిపి చంద్రగిరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం చంద్రబాబు అలివిగాని హామీలను ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన చంద్రబాబు నిధులు లేవని చెప్పడం ప్రజలను నిలువునా మోసం చేయడమే అన్నారు. నయవంచనతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసిపి చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నాయకత్వంలో బుధవారం (జూన్ 4న) వెన్నుపోటు దినం కార్యక్రమం ద్వారా టవర్ క్లాక్ వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పార్లమెంట్ పరిశీలకుడు, ప్రత్యేక ఆహ్వానితుడు చావా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం చంద్రగిరి నుండే అమలు చేయడం ప్రారంభించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఫలితాలు వెళ్ళడికాగానే వైసిపి నాయకులు, కార్యకర్తలపై భౌతికదాడులు, ఆస్తుల విధ్వంసం చేపట్టినట్లు దుయ్యబట్టారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరిలో మాఫియా రాజ్యమేలుతొందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇప్పటి వరకు ఎంత మందికి ఇచ్చారంటూ ఎద్దేవా చేశారు.

ఉచిత బస్సు హామీ తుస్సుమనిపించారని, ఉగాది, దీపావళి, సంక్రాంతి, ఆగస్టు అంటూ వాయిదాలతో కాలయాపన చేస్తున్నట్లు దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, చంద్రగిరి మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటరత్నం, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, రాజయ్య, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిఖ్ భాషా, వైసిపి మండల వాలంటీర్స్ విభాగం అధ్యక్షుడు సూరి, కొత్తపాటి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

## - కెవికె శాస్త్రవేత్త డాక్టర్ బి విజయ శ్రీ.



వెంకటగిరి, జూన్ 3, ప్రభాతవార్త

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి. విజయ శ్రీ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం, వెంకటగిరి శాస్త్రవేత్త డా. బి. విజయశ్రీ ఆద్వర్యంలో వెంకటగిరి మండలం లోని వల్లివేడు గ్రామ పంచాయతి పరిధిలోని గ్రామాలలో రైతుల కొరకు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, వ్కయవసాయ, ఉద్యాన పసుసంవర్ధక సిబ్బందితో కలిసి రైతులతో పరస్పర ముఖాముఖి ప్రత్యక్ష పరస్పర చర్చా కార్యక్రమాలను మరియు సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ పంటలకు సంబంధించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన కల్పిస్తూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలను, ప్రకృతి వ్యవసాయ పద్దతులు, సమతుల ఎరువులు వాడకం, పసుగ్రాసల రకాలు వివరించి, జీవ నియంత్రణ పద్దతులు పాటించి నాణ్యమైన వితనాలు వాడి అధిక దిగుబడులు పొందాలన్నారు. భారతీయ వరి పరిశోధన సంస్థ ,హైదరాబాద్ శాస్త్రవేత్తలు డా.మంగలదీప్ కుట్టి, డా. యమ్.యస్. అనంత మాట్లాడుతూ నూతన వారి రకాలు, నేల పరీక్ష విధానాలు, పంట వైవిధీకరణ యంత్ర ఆధారిత వ్యవసాయం మొబైల్ యాప్‌ల వినియోగం, రైస్ క్లినిక్ యాప్ వంటి అంశాలను వివరించారు.తదుపరి వల్లివేడు రైతు మల్లికార్జునరెడ్డి పొలం లోని మట్టి నమూనా శాస్త్రవేత్తలు రైతు లతో కలిసి పరీక్షించి రైతులకు చూపించటం జరిగింది. వివిధ పంటలకు సంబందించిన కరపత్రాలను రైతులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, వ్యవసాయ మరియు ఉద్యాన అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.

# నాయుడుపేటలో వరుస చోరీలు...



నాయుడుపేట జూన్ 3 ప్రభాతవార్త;

నాయుడుపేట పట్టణంలో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండటంతో మహిళలు ఒంటరిగా ఇంటినుండి బయటకు రావాలంటే దొంగల బెడదకు హడలిపోతున్నారు.నాయుడుపేటలో పోలీసుల నిఘా కొరవడుతుండటంతో దొంగలు హల్‌చల్ చేస్తూ పోలీసులకే సవాల్ విసురుతున్నారు.నాయుడుపేట పట్టణంలోని బీడికాలనికి చెందిన చంద్రమ్మ భాలాజి గ్రీన్‌సిటి వద్ద ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు మోటార్‌సైకిల్‌పై వచ్చి చ ంద్రమ్మ మెడలో ఉన్న మూడుసవర్ల బంగారు సరుడును లాక్కొని అక్కడ నుండి ఉడాయించారు.అదే విధంగా నాయుడుపేటలో ఒంటరిగా వెళుతున్న మహిళలను టార్గెట్‌చేసి వారి మెడలోని బంగారు చైన్లను లాకొని వెళ్ళిన సంఘటనలు అనేకం జరుగుతున్నాయి.అంతేకాకుండ ఇటీవల కాలంలో ఇంటికి తాళాలు వేసియున్న ఇళ్ళను గుర్తించి చోరీలకు పాల్పడుతున్నారు.గతవారంలో మహలక్ష్మి నగర్‌లో ఓఇంటికి తాళంవేసి ఉండటాన్ని గుర్తించిన నలుగురు వ్యక్తులు మధ్యహన సమయంలో వచ్చి ఇంటితాళాలు పగలగొడుతుండగా పక్కింటివారు గుర్తించి పెద్దగా కేకలు వేయడంతో ఆదుండగులు అక్కడ నుండి పరారైయ్యరు.నాయుడుపేటలో ఓముఠా సంచరిస్తూ ఒంటరిగా వెళుతున్న మహిళలను,ఇంటికి తాళంవేసి ఉన్న ఇళ్ళలను గుర్తించి చోరీలకు పాల్పడుతున్నారు.

నాయుడుపేటలో పోలీసుల పర్యవేక్షణ లోపం,నిర్లక్ష్యం కారణంగా చోరీలు,హత్యలు జరుగుతున్నాయి. అదేవిధంగా పట్టణంలో అనధికారంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణాల వద్ద తరచూ మద్యంప్రియులు ఘర్షణలకు దిగుతున్నా లార్జీలు, మద్యంషాపుల నిర్వహాకుల నుండి పోలీసులు నెలసరి మామ్ముళ్ళు తీసుకోవడంతో ఆదిశగా పోలీసులు తనిఖీలు చేపట్టడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైన జిల్లాపోలీసు ఉన్నతాధికారులు స్పందించి నాయుడుపేటలో చోరీలు నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణప్రజలు కోరుతున్నారు.

# పోలీసులూ తస్మాత్ జాగ్రత్త..!

## టిడిపి సంబరాలు .. వైసిపి వెన్నుపోటు దినం శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం



చంద్రగిరి, జూన్ 3 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తి చేసుకున్న నేపధ్యంలో పోలీసులూ తస్మాత్ జాగ్రత్త అనే హెచ్చరికలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జూన్ 4న కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై (విజయంపై) టిడిపి పిలుపు నేపధ్యంలో కూటమి శ్రేణులు పండుగ వాతావరణంలో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద బుధవారం సంబరాలు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇదేక్రమంలో మంగళవారం చంద్రగిరిలో వైసిపి నాయకులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి జూన్ 4న చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహించతలపెట్టారు. ఒకే రోజున అధికార ప్రతిపక్ష పార్టీలు నిర్వహించతలపెట్టిన సంబరాలు, నిరసనలు ఏ సమస్యకు దారితీస్తాయోనని స్థానికులు భయాందోనలకు గురవుతున్నారు. టిడిపి సంబరాలు, వైసిపి వెన్నుపోటు దినం ఈ రెండు కార్యక్రమాలలో సంఘవిద్రోహులు, ఆకతాయిలు పాల్గొని రెచ్చగొట్టే దోరణులకు పాల్పడితే శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం వుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

# 6 నుండి శ్రీవారిమెట్టు మార్గం టోకెన్లు అలిపిరిలోనే జారీ



తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి కాలినడకన తిరుమలకు వస్తున్న భక్తులకు దివ్యదర్శనం టోకెన్ల జారీలో తాత్కాలిక మార్పులు చేశారు. కాలినడకన శ్రీవారిమెట్టుమార్గంలో వస్తున్న భక్తులకు జారీ చేస్తున్న దర్శనటోకెన్లను తాత్కాలికంగా అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్లలోనే జారీచేసేలా ఏర్పాట్లుచేశారు. ఈ టోకెన్ల జారీపై శ్రీవారిమెట్టు,శ్రీనివాసమంగాపురం, అలిపిరి, తిరుపతి శ్రీనివాసం, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో విస్తృతంగా భక్తులకు ప్రసారం చేస్తున్నారు. ఆ కౌంటర్లను తాత్కాలికంగా శుక్రవారం 6వతేదీ నుండి అలిపిరి భూదేవికాంప్లెక్స్‌కు మార్పుచేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేయాలని టిటిడి ఈఓ శ్యామలరావు ,అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులను ఆదేశించారు.

## నేరస్తులకు మాత్రమే జగన్ ఓదార్పు : మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, జూన్ 3 ప్రభాతవార్త

ఓదార్పుకు బ్రాండ్ అంబాసిడర్ అయిన జగన్‌రెడ్డి నేరస్తులకు మాత్రమే ఓదార్పు చేస్తారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ప్రకటనలో పేర్కొన్నారు.ఒక సిఎంగా పనిచేసిన వ్యక్తి గంజాయి ముఠాలు, రౌడీషీటర్లకు మద్దతుగా వెళ్తుండడం దారుణమన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, చనిపోయిన పార్టీని బతికించుకోవడమే వైసిపి ఏకైక సిద్ధాంతంగా మారిందన్నారు. జగన్ హయాంలో దళితులపై ఎన్నో ఘోరాలు జరిగాయన్నారు. జగన్ దళిత ద్రోహిగా నిలిచిపోయారన్నారు. కరుడుగట్టిన నేరస్తులకు జగన్ మద్దతు ఇస్తున్న నేపథ్యంలో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## చిత్తూరు కోర్టుకు హాజరైన కుప్పం దేశం శ్రేణులు



కుప్పం, జూన్ 3 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ ంకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ శ్రేణులు మంగళవారం జిల్లా కేంద్రం చిత్తూరులోని కోర్టుకు హాజరయ్యారు. వైఎస్సార్సీ హయాంలో 2022 ఆగస్టులో రామకుప్పం మండల ం కొ ంగనపల్లి పంచాయతీ కొల్లుపల్లిలో జరిగిన సంఘటనల నేపథ్యంలో సుమారు ముప్పై మంది తెదేపా నేతలు, కార్యకర్తలపై హత్యాయత్నంతో పాటు వివిధ సెక్షన్ల కింద అప్పట్లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసు వాయిదా నిమిత్తం మంగళవారం దేశం శ్రేణులు చిత్తూరుకు వెళ్లారు. కేసు విచారణ మరలా ఈనెల 30వతేదికి వాయిదా పడినట్లు తెలిసింది.

## రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శిగా

ఆవులపాటి బుజ్జిబాబు నియామకం



**తిరుపతి కలెక్టరేట్, జూన్ 3 ప్రభాతవార్త :** రాష్ట్ర సంక్షేమ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శిగా తిరుపతికి చెందిన ఏపీ నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆవుల పాటి బుజ్జిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజ్ నుంచి ఉత్తర్వులు అందాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర రావు ఆదేశాల మేరకు తనపై ఎంతో నమ్మకం ఉంచి జిల్లా ప్రచార కార్యదర్శిగా నన్ను నియమించిన సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరి నాగరాజ్‌కు, రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర రావుకు, రాష్ట్ర నేతలు, జిల్లా నేతలు, గౌరవ సభ్యులకు ఆవుల పాటి బుజ్జిబాబు కృతజ్ఞతలు తెలిపారు. నేటి నుంచి సంఘం బలోపేతానికి కృషి చేయడంతో పాటు బీసీలు సామాజిక, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు సైనికునిలా పనిచేస్తానని ఆవుల పాటి బుజ్జిబాబు హామీ ఇచ్చారు.

## పద్మావతిపురంలో వైభవంగా గంగ జాతర

-గంగమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతిరూరల్, జూన్03 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం పద్మా వతి గ్రామ పంచాయతీలో గంగ జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. గంగజాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే పులివర్తి నాని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, మొక్కులు తీర్చుకు న్నారు. పద్మావతి ప్రజలు సుఖశాం తులతో ఆయు:ఆరోగ్యాలతో వర్ధిల్లా లని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, గణపతినాయుడు, రాజేంద్ర, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగులు సంచరించే సమయంలో జాగ్రత్తగా ఉండాలి

భాకరాపేట, జూన్ 3, ప్రభాతవార్త



చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్లలో మంగళవారం ఆర్డీఓ రామ్మోహన్ గ్రామసభ నిర్వహించారు. అయన మాట్లాడుతూ ఏనుగులు అడవులకు ఆనుకొని ఉన్న పంట పొలాల్లోకి వచ్చినపుడు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు ఇటీవల ఇదే గ్రామంలో ఏనుగు తొక్కిసలాటలో రైతు మృతి చెందిన విషయం విదితమే ఫారెస్ట్ రేంజర్ వెంకటరమణ మాట్లాడుతూ వచ్చినట్టు తెలిస్తే మాకు తెలపాలన్నారు. మా బీట్ ఆఫీసర్లు వాటిని అడవిలోకి తార్మడానికి ప్రయత్నిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జనార్దన్ రాజు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బెల్లంకొండ మురళి, రైతులు పాల్గొన్నారు

## ఏడాది కూటమి పాలనపై జనసేన సంబరాలు



**తిరుపతి విద్య, జూన్ 3 ప్రభాతవార్త** వైసిపి అరాచక పాలనకు ముగింపు పలకడంతోపాటు కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఏర్పడి ఏడాదైన సందర్భంగా పండుగలా వేడుకలు నిర్వహించ నున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆలోచనా విధానం కు అనుగుణంగా బుధవారం ఉదయం 9 గంటలకు ఎస్టీవీ నగర్ లో ముగ్గులు పోటీ, సాయంత్రం ఎస్టీవో కాలనీలోని తన కార్యాలయం వద్ద 5.30 గంటలకు దీపాలు వెలిగించడంతో పాటు టపాకాయలు కాల్చనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరు ఈ శుభతరుణంలో వాకిళ్ళను రంగవల్లులతో అలంకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయాలని ఆయన కోరారు. అలాగే ముగ్గుల పోటీ తో పాటు సాయంత్రం దీపాలు వెలిగించడం, టపాసులు కాల్చడాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఆనందాన్ని ప్రజలతో పంచు కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైసీపీ వెన్నుపోటు దినోత్సవం కాకుండా గొడ్డలిపోటు దినోత్సవం నిర్వహిస్తే బాగుండేదన్నారు. ప్రజలని మోసం చేయడమే కాకుండా రాష్ట్రాన్ని లూటీ చేసిన వైసీపీకి ఎన్డీఏ కూటమి పాలనను విమర్శించే అర్హత లేదని ఆయన అన్నారు.

## విద్యుత్, నీటి సమస్య పరిష్కరించాలి



పుంగనూరు రూరల్, జూన్ 3 ప్రభాతవార్త

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సమావేశాన్ని ఎంపిపి అక్కిసాని భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో లీలమాధురి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల వారు తమ పంచాయితీలోని విద్యుత్, నీటి సమస్యలను వెంటనే పరిష్కారించాలని అధికారులను కోరారు.

## వృద్ధుడికి బియ్యం పంపిణీ

-వార్తకు స్పందన



చౌడేపల్లి, జూన్ 3 ప్రభాతవార్త

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన వృద్ధుడు వెంకట్రమణకు బియ్యం పింపిణీ చేసారు. " గూడు కాలిబూడదాయే...బతుకు బరువాయే "అన్న శీర్షికన వార్తలో కథనం ప్రచురితమైన విషయం విధితమే. స్పందించిన తహాశీల్దార్ హనుమంతు వృద్ధుడికి తక్షణ సాయంగా 10కిలోల బియ్యాన్ని పంపిణీ చేసారు. ఈమేరకు చౌకదుకాణం దారుడు వృద్ధుడికి అందించాడు. ప్రభుత్వం నుంచి మరింత మేలు చేకూరుస్తామని తహాశీల్దార్ తెలిపారు.

## వెన్నుపోటు పొడిచింది ఎవరో ప్రజలకు తెలుసు..

ప్రజాతీర్పును గౌరవించడం వైకాపా అధ్యక్షుడికి తెలియదా..!

-ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



**పలమనేరు, జూన్ 3 ప్రభాతవార్త:** ప్రజలకు ఇచ్చిన హామీను 10 శాతం కూడా అమలు చేయని వైకాపాకు ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించడం వైకాపా అధ్యక్షులకు తెలియదని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి విమర్శించారు.స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో జరిగిన కుంభకోణాల నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి నేడు వైకాపా వెన్నుపోటు దినం అంటూ కార్యక్రమాలు చేపట్టనుందని తెలిపారు.వారు అధికారంలోకి వచ్చిన ఏడాదిలో 10 శాతం హామీలను కూడా అమలు చేయని జగన్ ప్రభుత్వానికి ప్రజలు గత ఏడాది ఇచ్చిన తీర్పును వెన్నుపోటు దినంగా ప్రకటించడం సరికాదన్నారు.నిజానికి ఏపి ప్రజలను,సామాజిక న్యాయానికి జగన్ వెన్నుపోటు పొడిచారని విమర్శించారు.కూటిమి ప్రభుత్వంలో ఏడాదిలోనే పెన్షన్ల పెంపు,డిఎస్సీ నోటిఫికేషన్,దీపం సిలిండర్ల అమలు,గ్రామీణ రోడ్డు అభివృద్ధి,మత్స్యకారులకు ఉపాధి,అన్నా క్యాంటీన్లు ప్రారంభం,చెత్తపన్ను రద్దు,కేంద్ర వాయోజిత పథకాల్లో 73 పథకాలు పునరుద్ధరణతో పాటు పలు సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను తమ ప్రభుత్వం చేపట్టిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి పై జరుగుతున్న విచారణలను,జరిగిన కుంభకోణాల విషయాల నుండి ప్రజలను మల్లించేందుకు డ్రామాలు చేస్తున్నారని ఆ డ్రామాలో వెన్నుపోటు దినం డ్రామా ఒక్కటని విమర్శించారు

## రైతులకు రాయితీతో ఊజీ బుట్టలు పంపిణీ

కుప్పంరూరల్, జూన్ 3 ప్రభాతవార్త

ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు రాయితీతో మామిడి ఊజీ బుట్టలు పంపిణీ చేస్తున్నట్లు ఉద్యానవన అధికారి డింపుప్రియశ్రీ పేర్కొన్నారు. ఊజీ బుట్టలు అవసరమైన కుప్పం మండల రైతులు బుధవారం నుంచి కుప్పం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద పొందవచ్చన్నారు. ఒక్కో రైతుకు నలభై బుట్టలు రాయితీతో అందిస్తామన్నారు. రైతులు ఆధార్, పాసుపుస్తకం నకళ్లను వెంట తేవాలన్నారు. ఒక్కో ఊజీ బుట్ట ధర 11రూ.లు మాత్రమేనన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, జూన్ 3 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో ఉన్న పేదల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కుప్పం గ్రామీణ మండలంకు సంబంధించి మంజూరైన 20లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌తో కలసి ఆయన అందజేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల మాట్లాడుతూ కుప్పం ప్రాంత ప్రజల కోసం టాటా హెల్త్ సైన్సెస్ వారితో ఒప్పందం జరిగిందన్నారు. త్వరలోనే కుప్పంలో డిజిటల్ హెల్త్ సెంటర్ అందుబాటులో వస్తుందన్నారు. ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు జరిపి అవసరమైన వైద్యం కోసం చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. బాధితులు త్వరగా ఆరోగ్యవంతులుగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న బాధితులు సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, కడ సభ్యుడు రామచంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ఎవి రవి, మహేంద్ర, నేతలు శివకుమార్, మోహన్, బగ్గిడి వెంకటేష్, సుబ్రమణ్యం, దామోదర్, సంతూరు, శరవణ, సర్పంచులు రవి, సంతోష్, కడ సభ్యురాలు సుగుణమ్మ పాల్గొన్నారు.

## అక్షరవనం రీసెర్చ్ సెంటర్‌కు విద్యార్థి ఎంపిక



శాంతిపురం, జూన్ 3 ప్రభాతవార్త

మండలంలోని కెనమాకులపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి చరిష్ సాయి తెలంగాణా రాష్ట్రం కల్వకుర్తిలోని అక్షరవనం రీసెర్చ్ సెంటర్‌కు ఎంపికయ్యాడు. ఏటా అక్షరవనం సంస్థ కలామ్ హండ్రెడ్ పేరిట వందమంది విద్యార్థుల్లో పదిమంది ప్రతిభ చూపిన విద్యార్థుల్ని తమ సంస్థలో తీర్చిదిద్దుతోంది. ఇందులో చరిష్ ఎంపికయ్యాడు. ఇతను మోడల్ స్కూల్, నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశాల్లో సైతం ప్రతిభ చాటాడు.

## శాంతిపురంలో 6నుంచి రైతులకు వేరుసెనగ విత్తనాలు పంపిణీ

శాంతిపురం, జూన్ 3 ప్రభాతవార్త

ప్రభుత్వం ఏటా రైతులకు రాయితీతో అందించే వేరుసెనగ విత్తన బస్తాలను ఈనెల 6వతేది నుంచి రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. 4వతేది విత్తనాల పంపిణీని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభిస్తారన్నారు. 6వతేది నుంచి సొన్నేగానిపల్లి, మఠం, ఎంకెపురం, అబకలదొడ్డి, కొలమడుగు, కడపల్లి రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తామన్నారు. అలాగే 8న కెనమాకులపల్లి, గుంజార్లపల్లి, చిన్నారిదొడ్డి, మొరసనపల్లి, దండికుప్పం, 10న 64 పెద్దూరు, 121 పెద్దూరు, బండపల్లి, అనికెర, చెంగుబళ్ల, రాళ్లబూదుగూరు, కర్లగట్ట, శివరాంపురంలో పంపిణీ జరుగుతుందన్నారు. రైతులు బస్తాకు రూ 1674లు చెల్లించాలన్నారు.

## వి.కోటలో ఘనంగా గంగమ్మ జాతర

వి.కోట, జూన్ 3 ప్రభాతవార్త



వి.కోట పట్టణంలో మంగళవారం శ్రీ గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారి ఆలయం నుంచి శిరస్సును పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకం దేవస్థానంలో ఈఓ ఆకస్మిక తనిఖీలు

కాణిపాకం, జూన్ 3 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈఓ పెంచల కిషోర్ మంగళ వారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థానం అన్నదాన భవన్, భక్తులు పాదరక్షలు, లగేజి భద్రపరచుకునే కౌంటర్లు నందు ఆకస్మికం తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు భక్తుల నుండి సంబంధిత కౌంటర్లు నిర్వహకులు ఎంత మొత్తంలో వసూలు చేసున్నారని ఆరా తీశారు. అలాగే దేవస్థానం నిర్ణయించిన ధర కన్నా అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే అన్నదాన భవన్‌ను తనిఖీ చేసి భక్తులతో మాట్లాడుతూ అన్నదాన భవన్‌లో భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు శుచి, శుభ్రతతో కూడిన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఈఓ వెంట పెంచల కిషోర్ వెంట ఆలయ ఏఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆశా డే

సదుం, జూన్ 3, ప్రభాతవార్త



చెరుకువారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఘనంగా ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరీశా మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త గ్రామాలయందు తప్పక ప్రజలతో కలిసి వారికి ఆరోగ్య సలహాలు సూచనలు ఇవ్వాలని,గర్భవతులు తొందరగా గుర్తించి వారికి అందించే సేవలను పూర్తి స్థాయిలో అందించవలెనని చెప్పారు. సీజనల్ వ్యాధులను గుర్తించడం, వాటి నివారణ చర్యలు చేపట్టాలని ,రక్తహీనత గురైన గర్భవతలను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని,వారికి సుఖప్రసవం కొరకు ప్రభుత్వ హాస్పిటల్ తీసుకొని వెళ్లాలని చెప్పారు. పిల్లలకు 5 సంవత్సరాలలోపు అందించే అన్నీ టీకాలు షెడ్యూల్ ప్రకారం అందించి టీకాలు ప్రాముఖ్యత తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఆశా నోడల్ ఆఫీసర్ జానకి, ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది నీలకంఠ, ఆరోగ్య కార్యకర్తలు హేమలత, సరస్వతి, సతాజ్, నాగరత్న, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపటి నుంచి వేరుశెనకాయలు పంపిణీ

సదుం, జూన్ 3 ప్రభాతవార్త

ఈనెల 5వ తేదీ నుంచి మండలంలో రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మాధవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద వేరుశనగ విత్తనాలు కే సిక్స్, నారాయణ రకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మండలానికి 920 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం చేరిందన్నారు. కే6 రకం వేరుశనక్కాయలు బస్తా 1674 రూపాయలు, నారాయణ రకం 30 కిలోలు బస్తా ధర 1710 రూపాయలుగాను ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. రైతులు తమ పాసుబుక్కు ఆధార్ కార్డులతో రైతు సేవ కేంద్రంనికి వెళ్లి విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ప్రతి రైతు వేరుశనగ పంట వేయాలని చెప్పారు.

## పారదర్శకంగా కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ

చిత్తూరురూరల్, జూన్ 3 ప్రభాతవార్త:



రాష్టంలో ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టి రేషన్ కార్డుదారులకు నిత్యవసరాలను పారదర్శకంగా పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఇరువారం లోని చౌకదుకాణాన్ని తనిఖీ చేసి రేషన్ పంపిణీని పరిశీలించారు. కార్డుదారులకు ప్రభుత్వం నిర్దేశించిన రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. గత ప్రభుత్వం ఎండియు వాహనాల పేరుతో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి వాహనాల కోసం కోట్ల రూపాయల నిధులను దుర్వినియోగం చేసారన్నారు. అనంతరం ప్రశాంత్‌నగర్‌లోని చంద్రబాబునాయుడు కాలనీని సందర్శించి మురుగు కాలువలను నిర్మించడానికి అవసరమైన అంచాలను రూపొందించాలని మున్సిపల్ కమిషనరుకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్, కమిషనరు నరసింహ ప్రసాద్, ఎంఈ వెంకటరామిరెడ్డి, కార్పొరేటర్ అశోక్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## గంగమ్మజాతరలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరురూరల్, జూన్ 3 ప్రభాతవార్త:



చిత్తూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిగిన గంగమ్మజాతర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు. నగరపాలక పరిధిలో ఇరువారం, ప్రశాంత్‌నగర్, 190 రామాపురంలో ప్రతిష్టించిన గంగమ్మకు పట్టు వస్త్రాలను సమర్పించి, హారతులను ఇచ్చి పూజలు చేసారు. అలాగే 190 రామాపురం గ్రామంలో మహిళలకు చీరలను పంపిణీ చేసారు. కాగా అంతకు మునుపు జాతరకు విచ్చేసిన ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనస్వాగతం పలికి పూలమాల, శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజసింహులు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జిజెఎం చారిటబుల్ పౌండేషన్ డైరెక్టరు గురజాల చెన్నకేశవులునాయుడు, తెదేపా నాయకులు వసంత్‌కుమార్, ప్రజాప్రతినిధులు, క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ ఏర్పాట్లు

పుంగనూరు రూరల్, జూన్ 3 ప్రభాతవార్త



ఈ నెల 7న జరిగే బక్రీద్ పండుగ ఏర్పాట్లను మంగళవారం సీఐ సుబ్బరాయుడు పరిశీలించారు. పుంగనూరు నానాసాహెబ్ పేటలోని ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అంజుమన్ కమిటీ సెక్రటరీ ఇబ్రహీంతో కలసి తర్వాత ఏర్పాట్లపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకున్నారు. సామూహిక ప్రార్థనలు జరిగే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు తెలిపారు.

## 9న బోయకొండలో యోగా దినోత్సవం : ఆర్డీఓ భవాని

చౌడేపల్లి, జూన్ 3 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ పరిసర ప్రాంతంలో ఈనెల 9న యోగా దినోత్సవాన్ని జరపనున్నారు. ఈమేరకు పలమనేరు ఆర్డీఓ భవానీ మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు యోగాడే జరుగుతోందన్నారు. మండలంలోని 2వేల మందితో బోయకొండ వద్ద యోగాడేను ఘనంగా జరిగేందుకు అందరం కృషి చేయాలన్నారు. అనంతరం బోయకొండకు వెళ్ళి స్థలాన్ని పరిశీలించారు. తహశీల్దార్ హనుమంతు, ఎంపిడిఓ లీలామాధవి, ఎంఇఓ కేశవరెడ్డి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గణపతి భూ కబ్జాలు చూస్తుంటే...మాకే భయం వేస్తోంది

తిరుపతి హెల్త్, జూన్ 3 ప్రభాతవార్త :




పద్మావతి పురం మాజీ సర్పంచ్, టీడీపీ నేత గణపతి నాయుడు భూ కబ్జాలు చూస్తుంటే మాకే భయం వేస్తోందని వైసీపీ తిరుపతి రూరల్ నేతలు చిన్నియాదవ్, కేశవులు, మునీశ్వర్‌రెడ్డి, పలువురు వైసీపీ నేతలు పెద్ద ఎత్తున ఆరోపణలు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత వైసీపీ, ప్రస్తుత టీడీపీ హయాంలో ఇష్టానుసారంగా భూ కబ్జాలకు పాల్పడుతూ రూ. కోట్లు సంపాదించి రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.మొత్తం మీద గణపతి నాయుడికి సెటిల్ మెంట్‌ల గణపతి అన్న పేరును కూడా తెచ్చుకున్నాడని విమర్శించారు. పద్మావతిపురం ఏకలవ్య నగర్, రజకుల దోభిఘాట్, చెరువు కట్టపైన, అర్బన్ హాట్ ఎదురుగా ఎరుకుల బాట, మార్కెట్ యాడ్ దగ్గర కాలువ పరంబోకు, ఇనాం భూములు, కూపు చంద్ర పేట ప్రాంతంలో రెండు ఎకరాలు, నాగూర్ కాలనీలో, పీఎస్4 వెనుక, ఉప్పర పల్లె, రైతు బజార్ వద్ద, విజయ హోటల్ దగ్గర, పుదిపట్ల విషయంలో సెటిల్ మెంట్లు, టబున్ దగ్గర కళ్ళం పరంబోకు, నాయుడమ్మ కళావతి సెటిల్‌మెంట్, మార్కెట్ యాడ్ ఛైర్మన్‌గా పనిచేస్తూ ఎన్నో అక్రమాలు, సెటిల్‌మెంట్లు, నల్లమానుకాలువలో, 24 గంటలకు వైన్ షాపు నడుపుతున్న వైనం, అర్బన్ హాట్ ఒరిజనల్ లీజుదారున్ని భయపెట్టి బలవంతంగా అర్బన్ హాట్‌ను లాక్కున్న విషయం, పాకాల హరి దగ్గర, ఫెయిర్ అండ్ ఫిస్ట్ హోటల్ పక్కన 600 అంకణాలు, శ్రీనివాసపురం సెటిల్‌మెంట్‌లో కోటి రూపాయలు తీసుకున్న విషయం ఇలా చెప్పుకుంటూ పోతే గణపతి నాయుడు ఓ భూ కబ్జాలకు వారసు డని చెప్పక తప్పదని వైసీపీ నేతలు, స్నేహితులు పెద్ద ఎత్తున గణపతి నాయుడుపై ఆరోపణలు చేస్తూ ఆధారాలతో కూడిన ఫోటోలను మీడియాకు చూపారు. ఇలా తప్పులు మీద తప్పులు చేసి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు.

## గురువును ప్రతి రోజు పూజించాలి

పాలసముద్రం, జూన్ 3 ప్రభాతవార్త:



విద్య నేర్పిన గురువులను ప్రతి ఒక్కరు నిత్యం పూజించాలని సీనియర్ న్యాయవాది జయకుమార్ పేర్కొన్నారు. అడ్వకేట్ జయకుమార్ మంగళవారం తనకు విద్య నేర్పిన గురువు సీనియర్ అడ్వకేట్ ఆర్ఎస్వీ నరసింహరాజు చిత్రపటంను తన శిష్యులతో కలిసి పూజించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ జయకుమార్ మాట్లాడుతూ పండదలకు దేవుళ్ళను ప్రతి ఒక్కరు పూజిస్తారని, అయితే మన ఉన్నతికి చేరుకోవడానికి జ్ఞానంను అందించిన గురువులు ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. ఇలాంటి గురువులను ప్రతి ఒక్కరు అనునిత్యం పూజించాలన్నారు.

## ఘనంగా జిల్లా 'దేశం' కార్యదర్శి వాసు జన్మదినం



**పాలసముద్రం, జూన్ 3 ప్రభాతవార్త:** జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వాసు జన్మదిన వేడుకలను మంగళవారం బలిజకండ్రిగలో ఘనంగా నిర్వహించారు. జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలోని పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బలిజకండ్రిగ గ్రామానికి వచ్చి జిల్లా దేశం కార్యదర్శి వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు తీసుకువచ్చిన కేక్‌ను వాసు కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు.

## వైఎస్ జగన్‌తోనే ఆర్థిక వ్యవస్థ నాశనం

- ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్

చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త:




గతంలో ఐదేళ్ళ పాటు రాష్ట్రంను పరిపాలించిన వైకాపా అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నాశనం చేశారని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ ధ్వజమెత్తారు. వైకాపా బుధవారం నిర్వహిస్తున్న వెన్నుపోటు దినోత్సవంపై ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజే పెన్షన్లు పెంచి లబ్ధిదారులకు అందిస్తున్నారన్నారు. ఉచితంగా గ్యాస్ సిలెండర్ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారు కావడంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కొంత జాప్యం జరుగుతున్నదని, ఈ ఏడాది ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని సిఎం నారా చంద్రబాబునాయుడు అమలు చేయడానికి సిద్ధం అవుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంను వైకాపా నాయకులు దోపిడి చేశారన్నారు. వైకాపా నాయకుల దోపిడికి ప్రస్తుతం ప్రభుత్వ అధికారులు కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి నెలకొందన్నారు. వైకాపా బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినోత్సవానికి ప్రజల నుండి ఎలాంటి స్పందన వుండదని ఆయన స్పష్టం చేశారు.

# తిరుపతి డివిజన్

## శివసేవకులు పేర్లు నమోదు చేసుకోవాలి: ఇఓ

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సేవలందించుటకు ముందుకు రావాలని అందుకు పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.శ్రీకాళహస్తీశ్వరాలయం పరిధి రోజు రోజుకు పెరుగుతుందన్నారు. స్వామి అమ్మవార్ల ఆలయాలోనూ, ఇతర ప్రాంతాల్లో భక్తులకు సేవలందించే లక్ష్యం సేవా భావం ఉన్న ఆధ్యాత్మిక చింతన కల్గిన వారు ముందుకు వచ్చి ఆధార్‌నకలుతో దేవస్థానం పరిపాలన భవనం నందు గల 'శివసేవాకేంద్రం'లో నమోదు చేసుకోవాలన్నారు.వయస్సు 20 నుంచి 55 సంవత్సరాల లోపు కల్గిన వారికిమాత్రమే అవకాశం అన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో నారాయణ ప్రభంజనం

తిరుపతి విద్య, జూన్ 3 ప్రభాతవార్త



ఎంఆర్ పల్లి న్యూ బాలాజీ కాలనీలోని నారాయణ కళాశాలలో జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారని నారాయణ డిజిఎం కొండలరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన అభినందన సభలో డీజీఎం కొండలరావు తమ విద్యార్థులు భానుచరణ్ రెడ్డి ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 4,ఓపెన్ కేటగిరీలో 51వ ర్యాంకు,మణిదీప్ రెడ్డి 345,హిమేష్ రాఘవ 468, శశాంక్ రెడ్డి 618,యశ్విత 906,నిఖిల్ 1056 వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు,మొదటి 100 లోపు ఒకటి,వెయ్యి లోపు 5, ఐదు వేలలో లలోపు 16, పది వేలలో 27 ర్యాంకులు ఓపెన్ కేటగిరీలో సాధించారన్నారు.అన్ని కేటగిరీలతో కలిపి దాదాపు 150కి పైగా ఐఐటి,ఎన్ఐటి ఐఐఐటిలో సీట్లు సాధిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాస రావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు విజయ్ కుమార్,చిట్టిబాబు, దుర్గా ప్రసాద్,ఉదయ్, అభిషేక్,ఏజీఎం గోపిలు అభినందించారు.

## నారాయణ జేఈఈ అడ్వాన్స్డ్ విజయోత్సవ ర్యాలీ

తిరుపతి విద్య, జూన్ 3 ప్రభాత వార్త



జే ఈ ఈ అడ్వాన్స్డ్ 2025 ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా 51వ ర్యాంకుతో పాటు మరెన్నో అత్యుత్తమ ర్యాంకులు సాధించినందుకు టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుపతి నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంఆర్ పల్లి నారాయణ కళాశాల నుండి బాలాజీ కాలనీ సర్కిల్,మున్సిపల్ ఆఫీస్,ఆర్టీసీ బస్టాండ్ మీదగా భారీ ర్యాలీ కొనసాగింది.టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రజలు ఆసక్తిగా గమనించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డీజిఎం కొండలరావు,కోర్డిన్ శ్రీనివాసులు,డీన్లు ఏజీఎంలు,ప్రిన్సిపల్స్, నారాయణఅధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు,విజయోత్సవ ర్యాలీలో వేలాదిగా పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో శ్రీధర్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి విద్య జూన్ 3 ప్రభాత వార్త



తిరుపతి ఏ.ఐ.ఆర్ బైపాస్ రోడ్డు లోని శ్రీధర్స్ కాలేజ్ విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ 2025 ఫలితాలలో జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలియచేసారు.యమ్. మహేష్ 114 ర్యాంకును, టి హంజిత్ 1505 ర్యాంకును,పి.నిఖిలేశ్వర్ 3312 ర్యాంకును,కె.హర్షా 7214 ర్యాంకును యమ్. లీపితా 9750 ర్యాంకులను సాధించారని అలాగే ఐదువేలలోపల మూడు ర్యాంకులను, పదివేలలోపు ఐదు ర్యాంకులను విద్యార్థులు ఉత్తమర్యాంకులు సాధించారని తెలిపారు ఈ ప్రతిభ చూపిన విద్యార్థిని, విద్యార్థులను చైర్మన్ మద్దినేని శ్రీధర్, అధ్యాపక బృందము అభినందించారు.తమ సంస్థ పాటిస్తున్న అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు.

## సిండికేట్ వ్యాపారస్తులు మామిడి రైతులను దగా చేస్తున్నారు...

వెంకటాద్రి యాదవ్..



**రేణిగుంట జూన్ 3 ప్రభాతవార్త** మామిడి సిండికేట్ వ్యాపారస్తులు ఏకమై మామిడి రైతులను దగా చేస్తూ అధిక లాభాలు పొందుతున్నారని బిజెపి యువనేత, రైతు నాయకులు వెంకటాద్రి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి రైతుల స్థితిగతులను మంగళవారం పరిశీలించిన వెంకటాద్రి యాదవ్ చలించి పోయారు. పలు మామిడి తోటలను పరిశీలించారు. పూత పిందె సమయంలో అకాల వర్షాలు, ఏనుగుల దాడులు, ప్రకృతి బీభత్సాలు మామిడి రైతులను అతా కుతలం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సంవత్సరం అంతా రేయి పగలు ఎండ వాన తేడా లేకుండా మామిడి తోటల్లో కష్టపడి దూర ప్రాంతాల నుండి కడవలో మీరు తెచ్చి చెట్లకు పోసి మామిడి పంటను పండిస్తున్నారని అన్నారు. విపత్తులను తట్టుకొని చేతికొచ్చిన కొద్ది పంటను మార్కెట్లో అమ్మాలనుకుంటే మామిడి వ్యాపారస్తులంతా కుమ్మక్కై సిండికేట్‌గా మారి రైతులకు గిట్టుబాటు ధరలు రానీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. మామిడి రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తమ పంటను వారు చెప్పిన రేటుకి అమ్ముకుంటున్నారన్నారు. సిండికేట్ వ్యాపారులు మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకొని లాభాలు పొందడమే కాకుండా రైతులను బికారులుగా మారుస్తున్నారన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య..

రేణిగుంట జూన్ 3 ప్రభాతవార్త



రేణిగుంట పట్టణం వేణుగోపాలపురం సమాధుల వద్ద మంగళవారం గుర్తుతెలియని సుమారు 55 60 సంవత్సరాల మధ్య వయసు గలిగిన వ్యక్తి ముళ్ళ కంపల చెట్టుకు తన పంచతో ఉరేసుకొని మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియలేదు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు తెల్ల పంచ, తెల్ల షర్టు, నిండు ఎరుపు రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. కాళ్లకు హవాయి చెప్పులు వేసుకుని ఉన్నాడు. ఇంతకుమించి ఎలాంటి ఆధారాలు లేవు. అర్బన్ సీఐ జయకృష్ణ ఆదేశాల మేరకు అర్బన్ ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి తమ సిబ్బందితో సంఘటన స్థలం చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షునిగా శేషాద్రి...

రేణిగుంట జూన్ 3 ప్రభాతవార్త

రేణిగుంట మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షునిగా పిల్ల పాలెం గ్రామానికి చెందిన శేషాద్రి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీకి కష్టకాలంలో సేవలు చేసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యకర్తలు చేసిన సేవలు పార్టీలో ఎప్పటికీ వృధా కావన్నారు. తనపై ఎంతో నమ్మకంతో గొప్ప బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పదవి రావడానికి సిఫార్సు చేసిన రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రమణ్యం రెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, మాజీ టిడిపి అధ్యక్షుడు చిన్నారెడ్డి, పార్టీ సీనియర్ నేతలు డి పుష్పనాదం, బుజ్జి నాయుడు, మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా తెలిపారు..

## వయోవృద్ధుల ఇంటి వద్దకే రేషన్



తిరుపతి కలెక్టరేట్, జూన్ 3ప్రభాతవార్త:

65 సంవత్సరాలు నిండిన కార్డు దారులు ఎవ్వరూ కూడా చౌక దుకాణం వద్దకు రావాల్సిన అవసరం లేదని, రేషన్ షాపు డీలర్ మీ ఇంటి వద్దకు వచ్చి సరుకులు అందజేస్తారని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆదేశాలలో ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు. ఈ మేరకు 65 సంవత్సరాలు పై బడిన వారికి ఐవీఆర్ఎస్ వాయిస్ మెసెజ్, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపడం జరుగుతుందని తెలిపారు.

**చంద్రగిరి నియోజక వర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌తో కలిసి చర్చిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని**

*తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త*





## పేదలకు పారదర్శకంగా రేషన్

కూటమి ప్రభుత్వంలో పేదలకు సక్రమంగా పారదర్శకంగా రేషన్ సరుకులు అందిస్తున్న టిడిపి నేతలు, రేషన్‌దుకాణాలతో లబ్ధిదారులు ఆనందంవ్యక్తం చేస్తున్నారు.

*ప్రభాతవార్త–తిరుపతి*

## సాంఘీక సంక్షేమ వసతి గృహాల దుస్థితిని గమనించండి:

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహాల దుస్థితిపై పాలకులు,ప్రభుత్వం స్పందించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేసారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో వార్డెన్,వంట,కామాటి,వాచ్‌మెన్‌ల కొరత నెలకొందని వివరించారు. ఇక్కడ సరైన వంట మనుషుల్లేదు.భద్రత లేదని ఆయన వివరించారు.ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఒక్క శ్రీకాళహస్తిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాంఘీక సంక్షేమ హాస్టళ్ళలో కనీస సదుపాయాల్లేదన్నారు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేస్తున్న యువ నాయకుడు విద్యాశాఖమంత్రి లోకేష్ సాంఘీక సంక్షేమ హాస్టళ్ళ దుస్థితిపై దృష్టి సారించాలన్నారు.పాఠశాలలు ప్రారంభానికి ముందు హాస్టళ్ళలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నివాసానికి అనుకూలంగా తీర్చి దిద్దాలని కోరారు. ముఖ్యంగా తిరుపతి జిల్లాలోని హాస్టళ్ళలో ఖాళీగా ఉన్న వార్డెన్,వంటమనిషి,వాచ్‌మెన్,కామాటి పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇక విద్యార్థులు నివాసానికి అనుకూలంగా గదులు,ఫ్యాన్లు, రక్షణ కల్పించాలని కోరారు.ఈ ఆందోళనలో ఆయనతో పాటు కోగిలి మునిచంద్ర,శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని శవం

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని తుఫాన్ సెంటర్ వద్ద ఉన్న అల్లిమడుగు పేట కొండపై ఓ గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని కనుగొన్నట్లు పట్టణ సిఐ డి.గోపి మంగళవారం వివరించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 35-40 సంవత్సరాలు ఉండవచ్చునని తెలిపారు. నలుపు రంగు ఫుల్ టీ షర్టు, షార్ట్ ధరించి ఉన్నాడని ఎడమచెవికి ఓ కమ్మ దరించి ఉన్నట్లు సిఐ గోపి వివరించారు. చుట్టుపక్కల వాడలను విచారించామని కానీ ఎవ్వరూ గుర్తించలేదని తెలిపారు. శవం గుర్తు పట్టడానికి వీల్లేకుండా కుళ్ళి పోయి ఉందని వివరించారు.

## జేఇఇ అడ్వాన్సు పరీక్షల్లో ఎంజిఎం విద్యార్థి సత్తా

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త



జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో శ్రీకాళహస్తిలోని ఎంజిఎం విద్యార్థి తన సత్తా చాటి పాఠశాల పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేసారు. ఆ విద్యార్థిని మంగళవారం కళాశాలలో నిర్వాహకులు గుడ్లూరు మయూర్ సారధ్యంలో సత్కరించారు.ఈ పరీక్షలకు తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని గోరంట్ల చరిష్మా(హాల్‌టిక్కెట్ నెంబర్ 256051542) అలిండియా స్థాయిలో 4120 ర్యాంక్ సాధించారన్నారు.ఆ విద్యార్థిని పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఇక్కడ మంచిపేరు తెచ్చినట్లుగానే భవిష్యత్తులో రాణించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మయూర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇంటర్ ఫలితాల్లోఅనేక స్టేట్ ర్యాంకులు సాధించి విద్యార్థులకు భవిష్యత్తు కల్పించామన్నారు.ప్రతి సారి తన కళాశాల నుంచి హాజరైన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి కళాశాల పేరు ప్రతిష్టలతో పాటు శ్రీకాళహస్తి పేరును ఇనుమడింపజేసారన్నారు.ఈ సంవత్సరం నుంచి నూతనంగా ఎంజిఎం షేస్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్నామని పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మయూర్ వివరించారు.ఈ కార్యక్రమాల్లో కళాశాల ఏఓ మహాదేవన్,సిబ్బంది పాల్గొన్నారు.

## బంగారమ్మకు పసుపు కుంకుమ అందించిన మాజీ ఎంఎల్ఏ

తొట్టంబేడు, జూన్ 3 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంలోని బంగారమ్మ ఆలయంలో జరుగుతున్న జాతర సందర్భంగా మంగళవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సంప్రదాయం మేరకు అమ్మవారికి పసుపు కుంకుమ, చీర,గాజులు అందించారు.వారికి ఆలయ కమిటి సాదరంగా ఆహ్వానించారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి సారె అందించగా అమ్మవారి తీర్థ ప్రసాదాలను పూజారి అందించారు.ఆయనతో పాటు మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్అంజూరు తారక శ్రీనివాసులు,మున్నారాయల్,ఉత్తరాజి శరవణ కుమార్,స్వర్ణమూర్తి,సురేష్,శ్రీనివాసులు,పులి రామచంద్ర, శివకుమార్,కృష్ణామూర్తి,శ్రీదర్ పాల్గొన్నారు.

## మృత్యుంజయ ఆలయ మండలాభిషేక పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపో గ్యారేజ్‌లో నూతనంగా నిర్మించిన మృత్యుంజయస్వామి ఆలయ మండలాభిషేక పూజలు శాస్త్రోక్తంగా స్థానిక సంప్రదాయం మేరకు నిర్వహించారు. మంగళవారం డిపోలోని ఆలయం వద్ద విశేష పూజలు ఏర్పాటు చేసారు. పూజలకుముఖ్యఅతిధులుగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు, డిపో మేనేజర్ మునిచంద్రలు హాజరుకాగా మండలాభిషేకం సందర్భంగా ఏర్పాటు చేసిన హోమాల్లో పాల్గొన్నారు. వేప,రాగి చెట్లకు వేదమంత్రాలతో లక్ష్మీనారాయణ కళ్యాణం జరిపించారు. ఆలయంలోని స్వామి వారికి షోడషాభిషేకాలు జరిపారు.ఈ కార్యక్రమాల్లో పసుపులేటి శ్రీనివాస్ కుమార్,ఎంఎస్ మణ్యం,మురళి, లింగమూర్తి,కుప్పయ్య,శ్రీధర్,సునీత,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి మిత్ర కిట్లను పరిశీలించిన జిల్లా అధికారి

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 3 ప్రభాతవార్త



ప్రభుత్వం కొత్త విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెట్టిన కొత్త పుస్తకాల సరఫరాను మంగళవారం పరిశీలించారు.కొత్త పుస్తకాల కిట్లు శ్రీకాళహస్తిమండల కార్యాలయానికి చేరాయి. శ్రీకాళహస్తి మండల విద్యాశాఖ అలాగే ఏర్పేడు మండల శాఖల నుంచి పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తున్నారు.ఈ ప్రక్రియనుజిల్లా సమగ్ర శిక్ష ఆడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ గౌరీ శంకర్ పరిశీలించారు.ఈ ఏడాది కొత్త పుస్తకాలను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను ప్రభుత్వం అందిస్తుంది.శ్రీకాళహస్తి మండలం నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను సరఫరా చేస్తున్నారు. పాఠ్యపుస్తకాల సరఫరాను పరిశీలించిన అధికారి ప్రత్యేకావసరాల పిల్లల కోసం ఆటిజం సెంటర్ ఏర్పాటుకు అవసరమైన తరగతి గదుల తెలుగుగంగ కాలనీలోని ఎపి టి డబ్ల్యుఆర్ఎస్ పాఠశాలను సందర్శించారు. అక్కడ కేంద్రం ఏర్పాట్లుకు అవసరమైన సదుపాయాల్ని పరిశీలించారు.ఆయనతో పాటు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రాష్ట్ర సలహాదారు సమగ్ర శిక్ష శ్రీరామ కమల్ మనోజ్ పాఠశాలలో గల గదులను,బాత్‌రూంలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను సూచించారు. ఈ కార్యక్రమాల్లో విద్యాశాఖకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు,ఎంఇఒ బాలయ్య,భువనేశ్వరి,దయాకర్,ఉపాధ్యాయులు సిఆర్‌పిలు సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా కీచక వధ

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 3 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం పాతవీరాపురంలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న మహోత్సవాల్లో భాగంగా మంగళవారం కీచక వధ కార్యక్రమాలు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఇక్కడి ఆలయంలో 51వవారి కోత్సవం జరుగుతుంది. పది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించటం ఆనవాయితి. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు హాజరై ఉత్సవాలను తిలకిస్తారు. ఉత్సవంలో భీముడు కీచకుని వధించే కార్యక్రమాలు జరిగాయి.ఈ సందర్భంగా మేళ తాళాల మధ్య ప్రత్యేక హారతులతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ మంజుల, మాజీ జడ్‌పిటిసి మునిరంగారెడ్డి, మాజీ ఎంపిటిసి మునిరత్నం రెడ్డి,ఆలయ కమిటి చైర్మెన్ కొంగర కృష్ణారెడ్డి, పూజారి రవి, బాలాజి,మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాత్రి కళ్యాణోత్స కన్నుల పండువగా నిర్వహించారు.

## 7న ఐటిఐలో ఓపెన్ హౌస్

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త

ఏర్పేడు మండల కకేంద్రంలోని ఐటిఐలో ఈ నెల 7న ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నామని డైరెక్టర్ సత్యనారాయణ మంగళవారం వివరించారు.జేఇఇ అడ్వాన్సు 2025కి అర్హత సాధించిన విద్యార్థులతో కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఏర్పాటు చేస్తున్నామని డైరెక్టర్ వివరించారు. సమావేశం హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యాకార్యక్రమాలు, క్యాంపస్ అభివృద్ధి,విద్యార్థి జీవితం యొక్కఅ వలోకనాన్ని పొందవచ్చునని డైరెక్టర్ వివరించారు.ఈ సెషన్ ప్రధానంగా సంస్థ యొక్క అండర్ గ్రాడ్యుయేషన్ పాఠ్యాంశాలపై దృష్టి పెడుతుందన్నారు. వీటిలో డ్యూయల్ డిగ్రీలు, బ్రాంచ్ మార్పు కోసం విధానం, హాస్టల్ మౌలిక సదుపాయాలు,ఆరోగ్యసౌకర్యాలు ఇతర విద్యార్థి కేంద్రీకృత సమాచారంతో రూపొందించామన్నారు. ఈ సెషన్‌కు విద్యార్థులు సరాసరి లేదా ఆన్‌లైన్లో హాజరుకావచ్చునన్నారు. ఓపెన్ హౌస్‌లో పాల్గొనాలనుకునే విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

## కూటమి ప్రభుత్వంలో అక్రమ రేషన్ రవాణాకు చెక్

టిడిపి మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు

కేవీబీ పురం, జూన్ 3 ప్రభాతవార్త:

రాష్ట్రంలో కూటమిప్రభుత్వం ఏర్పాటు కావడంతో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం రవాణాకు చెక్ పడిందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో జగన్‌ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి రేషన్ బియ్యాన్ని వైసీపీ నాయకులు విచ్చల విడిగా దోచుకుని ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకున్నారని ఎద్దేవా చేశారు. అలాగే ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని ప్రగల్బాలు పలికి రేషన్ అక్రమ రవాణాకు వైసీపీ నాయకులు రేషన్ సరఫరా చేసి వాహనాలను వినియోగించుకున్నారని తెలిపారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అక్రమ రవాణాకు చెక్ పెట్టి యధావిధిగా రేషన్ డీలర్ల ద్వారా రేషన్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుందని తెలిపారు.

## లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపరాదు

– మైనర్ బాలురపై స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ సిఐ



***తిరుపతి కార్పొరేషన్, జూన్ 3, ప్రభాతవార్త*** లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనాలు నడపరాదని ట్రాఫిక్ సిఐ సంజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డి.ఎస్పీ రామకృష్ణచారి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిఐ సంజయ్ కుమార్ లైసెన్స్‌లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్ బాలురపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అన్నమయ్య సర్కిల్, టౌన్ క్లబ్,గరుడ సర్కిల్, నందీ సర్కిల్ తోపాటు నాలుగు కాళ్ల మండపం మండపం వద్ద తనిఖీలు చేసారు. స్పెషల్ డ్రైవ్ లో భాగంగా 17 మంది మైనర్లు బాలురు ద్విచక్ర వాహనాలను నడపడాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. 17 మంది మైనర్లు బాలురకు అదుపులోకి తీసుకొని తొలుత వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. తరువాత మైనర్ బాలుర కుటుంబ సభ్యులను ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి మైనర్ బాలుర సమక్షంలో తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. తమ పిల్లలకు లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే మోటర్ చట్టం యాక్ట్ ప్రకారం ఐదు వేలు నుండి పదివేలు ఫైన్ వేయడం తోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామని తెలియజేసారు. మైనర్ బాలురకు వాహనాలు ఇచ్చి మీ కుటుంబాన్ని మీరే మీ చేతులరా పాడుచేసుకోవద్దని తిరుపతి జిల్లా పోలీసు వారు ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

## కారును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం: ఒకరు మృతి



చంద్రగిరి, జూన్ 3 ప్రభాతవార్త:

కారును ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో సతీష్ (29) మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. భారత్ పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ నింపుకుని రోడ్డుపైకి వస్తున్న కారు ఇరుప్రక్కల గమనించి రోడ్డుపైకి వెళ్ళవలసిన డ్రైవర్ నేరుగా హైవేపైకి రావడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇందిరమ్మ కాలనీకి చెందిన సతీష్ కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సతీష్ తీవ్రగాయాలపాలవగా 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో వున్న సతీష్ వైద్య చికిత్సలు పొందుతూ తుది శ్వాస విడిచాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కడపలో క్రీడా పాఠశాలకు 4,5వ తరగతి విద్యార్థులకు దరఖాస్తుకు ఆహ్వానం

తిరుపతి క్రీడ, జూన్ 3, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం డా. వైఎస్ఆర్ క్రీడా పాఠశాల, కడపలో 4వ తరగతి, 5వ తరగతి విద్యార్థులకు 2025 – 2026 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పించడానికి నోటిఫికేషన్ జారీ చేసారు. అభ్యర్థులు 31వ తేదీ మే 2025 నుండి 19వ తేదీ జూన్ 2025 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 4వ తరగతి బాలురు 20, బాలికలు 20, మొత్తం 40 మంది, 5వ తరగతి బాలురు 20, బాలికలు 20 మొత్తం 40 మందికి సీట్లు ఖాళీగా ఉందన్నారు. 4వ తరగతికి అభ్యర్థులు 8, 10 సంవత్సరాల మధ్య ఉండాలని 01.04.2015 నుంచి 31.03.2017 మధ్య జన్మించి ఉండాలన్నారు. 5వ తరగతికి అభ్యర్థులు 9, 11 సంవత్సరాల మధ్య ఉండాలని 01.04.2014 నుంచి 31.03.2018 మధ్య జన్మించి ఉండాలన్నారు. జనన ధృవీకరణ పత్రాన్ని జనన మరణాల రిజిస్ట్రార్ లేదా మున్సిపల్ కార్పొరేషన్లు లేదా జనన మరణాల 4వ తరగతికి రిజిస్ట్రేషన్ చట్టం 1989, 5వ తరగతికి 1969 కింద ఏదైనా ఇతర సూచించబడిన అధికారి జారీ చేయాలని, అది కంప్యూటర్ ద్వారా జనరేట్ చేయబడిన పాఠం 5 అయి ఉండాలన్నారు. వాస్తవా పుట్టిన తేది నుండి ఒక సంవత్సరం లోపు సర్టిఫికేట్ జారీ చేయాలని అప్పుడు మాత్రమే అర్హులన్నారు. దరఖాస్తు దారుడి ఒరిజినల్ డాక్యుమెంట్లు, వైద్య పరీక్షలలో సంతృప్తి చెందిన తరువాత మాత్రమే జిల్లా స్థాయి ఎంపిక పరీక్షలలో పాల్గొనడానికి అర్హులు అన్నారు. డిపార్ట్మెంట్ ద్వారా అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ, సమాచార ప్రచురణ 30.05.2025, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది 31.05.2025, దరఖాస్తు ముగింపు తేదీ 19.06.2025 ఉంటుందన్నారు.

## టీబీ లక్షణాలు వారికి గల్ల పరీక్ష చేయండి

సత్యవేడు, జూన్ 3 ప్రభాతవార్త:



టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి గల్ల పరీక్ష నిర్వహించాలని జిల్లా ఆరోగ్య వైద్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ కోరారు. మంగళవారం సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో టీబీ ముక్తభారత్ అభియాన్ వంద రోజులు కార్యక్రమంపై ఆయన జిల్లా టీబీ అధికారులతో కలసి జామ్ మీటింగ్ ద్వారా వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చి అవగాహన కల్పించారు. మే 19న ప్రారంభమైన టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం ఆగస్టు 23 వరకు కొనసాగుతుందన్నారు. ఇందులో భాగంగా అనుమానాస్పద టీబీ కేసులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పొగతాగే వారు, కోమార్బిడిటీ కండిషన్స్ ఉన్న వారు, గాలి వెలుతురు సక్రమంగా సోకని గృహ సముదాయంలో ఉండే వారిని గుర్తించి గల్ల పరీక్షలు నిర్వహించాలని సూచించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. గల్ల పరీక్షలో వ్యాధి నిర్ధారణ వారికి వెంటనే వైద్య చికిత్స అందించాలన్నారు. తదనంతరం వైద్యులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు టీబీ అంతం మనతోనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో దాసుకుప్పం ఎంపీహెచ్ఈవో సుబ్రహ్మణ్యం, ఎస్టీఎల్ఎస్ బాల శివ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన కుటుంబాలకు పార్టీ అండ: చెక్కుల అందజేత

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు శ్రీనివాసులు కుటుంబానికి మంగళవారం జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఎంఎల్‌సి నాగబాబు చెక్కులను అందజేసారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలుకు చెందిన శ్రీనివాసులు,ఏర్పేడు మండలానికి చెందిన రాజేష్‌లు ప్రమాదవశాత్తు మరణించారు. కుటుంబ పెద్దలు మృతి చెందటంతో ఆ కుటుంబాలను పోషించే దిక్కులేకుండా పోయింది. ఈ సమస్యను జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టేసాయి మండల అధ్యక్షుడు దండిరఘురామయ్యలు పార్టీ నాయకుడు పవన్‌కళ్యాణ్ దృష్టికి తెచ్చారు. వాస్తవాల్ని పరిశీలించిన పార్టీ వారిని ఆదుకొనుటకు ఆర్థిక సహాయం అందించుటకు నిర్ణయించింది. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసారు. బాధిత కుటుంబాలకు చెందిన వారిని జిల్లా కార్యదర్శి కొట్టేసాయి తీసుకెళ్ళారు. అక్కడ జనసేన క్రియాశీలక సభ్యుల ప్రమాదబీమా చెక్కులు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పు నాగబాబు అందజేసారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి కొట్టేసాయి, దండి రాఘవయ్య, ఏర్పేడు మండలనాయకులు పాల్గొన్నారు

## వైకాపా నాయకుడు హఠన్మారణం

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 3 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం చెన్నం పల్లికి చెందిన మాజీ సర్పంచ్ మండలంలోని వైకాపా నాయకుడు వన్నెరెడ్డి క్షత్రియుల సంఘ నాయకుడు తిరుమల అర్జున్‌రెడ్డి గుండెపోటుతో మరణించారు.మండలంలో సీనియర్ నాయకుడుగా ఆయన మండల ప్రజలకు సుపరిచయస్తులే. సర్పంచ్‌గా గ్రామాబివృద్ధికి ఎన్నో పనులు చేపట్టారు.సోమవారం కూడా తన పనులు చేసుకున్న అర్జున్‌రెడ్డి మంగళవారం గుండెనొప్పి అనటంతో డాక్టర్ల వద్ద కు తీసుకెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. ఆయన మృతికి వైకాపా నాయకులు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి, ఎంఎల్‌సి డాక్టర్‌సిపాయి సుబ్రమణ్యం,మండలనాయకుడుకిషోర్‌మండలనాయకులుసంతాపంతెలిపారు.వారికుటుంబాన్నిపరామర్శించారు

## బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి–తిరుపతి రహదారిలోని పట్టణ పొలిమేరల్లో గల మిట్టకండ్రిగ వద్ద మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడినట్లు వన్‌టౌన్ సిఐ డి.గోపి తెలిపారు.పల్లెవెలుగు బస్సు తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వస్తుండగా శ్రీకాళహస్తి నుంచి తమ స్వగ్రామమైన రామలింగాపురానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదం జరిగినట్లు వివరించారు.ఈ ప్రమాదంలో రామచంద్రయ్య(59) గాయపడగా వెంటనే 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ గోపి వివరించారు.

# గూడూరు డివిజన్

## సూపర్ సిక్స్ పథకాల అమలును విస్మరించిన కూటమి ప్రభుత్వం

### నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



వెంకటగిరి, జూన్ 3, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వ అధికారాలకు వచ్చి సంవత్సరం రోజులైనా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఎన్ జే ఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం వల్ల వెన్నుపోటు దినంగా ఈనెల నాలుగో తేదీ ఆందోళన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాపూర్ లో ఆందోళన కార్యక్రమం చేపడతామని చెప్పారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్నపోలీసులు ఆందోళన కార్యక్రమానికి అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ప్రజలకు హామీలు ఇచ్చి అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. వైసిపి హయాంలో ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చమని చెప్పారు. వెన్నుపోటు పొడవడం సీఎం చంద్రబాబు నాయుడుకి పేటెంట్ హక్కు అని చెప్పారు. ప్రజలకు ఎప్పుడూ వైసిపి అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్రమ కేసులు ఎక్కువ విమర్శించారు. పోలీసుల చేత అందర్నీ కొట్టిస్తున్నట్లు తెలిపారు. వెన్నుపోటు దినాన్ని వైసీపీ చేస్తుంటే కొన్ని ప్రసార సాధనాల వారు వక్రీకరిస్తున్నట్లు తెలిపారు. ఎందుకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నావో ప్రజలకు తెలుసులే అని తెలిపారు. ప్రజలే తెలుగుదేశం పార్టీకి గుణం పాటలు చెప్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ నక్క భానుప్రియ, వైస్ చైర్మన్ బాలయ్య, వైసిపి జిల్లా మాది కార్యదర్శి హరికృష్ణ, కౌన్సిలర్లు కళ్యాణి,పూజారి లక్ష్మి, వహీదా గోపాలకృష్ణ ఎంపి నారాయణ, శ్రీనివాసులు, నాయకులు ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, దశరథరామిరెడ్డి, బండి రమేష్ రెడ్డి, సతీష్‌లు పాల్గొన్నారు.

## నూతన జిమ్ము ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన





గూడూరు, జూన్ 3 ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ జన్మదిన వేడుకల్లో భాగంగా శాప్ చైర్మన్ రవి నాయుడు ముఖ్య అతిథితో పాటు ప్రముఖ పారిశ్రామికవేత స్థానిక నానాజీ స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా ఓపెన్ జిమ్ము, ఓపెన్ గ్యాలరీకి సంబంధించి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అల్లూరు ఆది శేషారెడ్డి స్టేడియంలో రెండు రోజుల నుండి ఎమ్మెల్యే క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించామన్నారు. గుడూరు పట్టణవాసులు, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన ప్రజలు ఓపెన్‌గా వాకింగ్‌తో పాటు జిమ్ము చేసుకునే అవకాశానికి దాతల పెన్వర్ రొయ్యల పరిశ్రమ అధినేత గంట మధుకృష్ణ నెక్కంటి రొయ్యల పరిశ్రమ వారు నూతన జిమ్ ఏర్పాటు చేయడం, అదేవిధంగా ఓపెన్ గ్యాలరీని జిందాల్ పవర్ ప్లాంట్ వారు ఏర్పాటు చేయడం సంతోష దాయకమన్నారు. అదేవిధంగా నా పుట్టినరోజుకి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్క నాయకునికి కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ్మిన పట్టణం గ్రామానికి చెందిన కోట సతీష్ ఆధ్వర్యంలో సిలికా సాండ్‌తో ఎమ్మెల్యే చిత్రాన్ని ఏర్పాటు చేసి బర్తడే శుభాకాంక్షలు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పోటుపాలెం గ్రామంకు చెందిన మాస్టర్ రుత్విక్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 12 లక్షల రూపాయలు ఎల్ఓసిను ఆ కుటుంబానికి శాప్ చైర్మెన్ రవినాయుడు చేతుల మీదుగా ఆ కుటుంబానికి శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్

## ఘనంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు

గూడూరు, జూన్ 3, ప్రభాతవార్త





గూడూరు పట్టణంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు కొండేపాటి గంగా ప్రసాద్, తానంకి నానాజీ ఆధ్వర్యంలో జాతీయ రహదారి పోటుపాలెం కుడలి నుండి చిల్లకూరు మండలం నాయకులు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తో కలిసి బైక్ ర్యాలీగా పార్టీ కార్యాలయం వరకు రావడం జరిగింది. అనంతరం భారీ పూలమాలలు శాలబాలతో ఘనంగా సన్మానించినారు సునీల్ కుమార్ అభిమానులు, సీనియర్ నాయకులు సోమిశెట్టి చెంచురామయ్య, కంకణాల పెంచలనాయుడు ఎమ్మెల్యే అభిమానులు కేరళ మంగళవాయిద్యం నడుమ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పలు వృధాశ్రమం, కూడలిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా గూడూరు రెండో పట్టణంలో ఉన్న టిడిపి నాయకులు గుమ్మడి వెంకటేశ్వర్ల యాదవ్ ఆధ్వర్యంలో కాస్మో పాలిటన్ క్లబ్ నందుభారీ రకదాన శిబిరం నిర్వహించారు. సుమారుగా 1000 యూనిట్లో రక్తాన్ని పార్టీ యువత ఇవ్వడం జరిగింది. అదే విధంగా వృధా ఆశ్రమంలో యాదనపత్తి భాస్కర్ రెడ్డి వృద్ధులకు మంచాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సేలం కిరణ్ కుమార్, పొలిమి శ్రీనివాసులు, పాప రెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి, గణపతి కిషోర్ నాయుడు, మధుసూదన్ రెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, పచ్చ వెంకటేశ్వర్ నాయుడు, మట్టం శ్రావణి, శ్రావణ రెడ్డి, గుండా లీలావతి, కొండూరు వెంకటేశ్వరరాజు, యాదనపర్తి భాస్కర్ రెడ్డి, శేషారెడ్డి, పూడిపర్తి ప్రవీణ్ కుమార్ రెడ్డి, గూడూరు రూరల్ , చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలం నుంచి పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి

### - పిడి వసంత భాయ్



వెంకటగిరి, జూన్ 3, ప్రభాతవార్త

బాల్య వివాహాలను చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంత భాయ్ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని బొప్పాపురం, రాణి పేట, మొక్కలపాడు గ్రామంలోని అంగన్వా డీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. బాలి కలు మేజర్ కాకుండా వివాహాలు చేస్తే నేర మని తెలిపారు. చిన్న వయసులో వివా హాలు చేయడం వల్ల అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. కిషోర్ బాలికలు పౌష్టికరమైన ఆహారం తీసుకోవాలని చెప్పారు. మహిళల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ శక్తి యాప్ను సెల్ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. శక్తి యాప్ ద్వారా తనను తాను రక్షించుకోవచ్చని చెప్పారు. పూర్తిగా సెల్ఫోన్ వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు గర్భవతులకు పౌష్టికరమైన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. చిన్నారులను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాల్లో తల్లిదండ్రులు చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వాసంతి, సిడిపిఓ శంషాద్ బేగం, సూపర్వైజర్లు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీ మొలక వేమాలమ్మ కుంభాభిషేకం



దొరవారి సత్రం,జూన్ 3,ప్రభాతవార్త:

దొరవారి సత్రం మండల పరిది లోని అక్కరపాక గ్రామంలో వెలసిన శ్రీ మొలక వేమాలమ్మ తల్లి కుంభాభిషేకం నేటి నుండి ప్రారంభం కానుంది. అమ్మను కన్న అమ్మ గ్రామ దేవత అక్కరపాకు, పొలిరెడ్డిపాళెం, గొల్ల పాళెం, గ్రామశక్తి అయిన వేమాలమ్మ తల్లి కుంభాభిషేకం ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు. ముఖ్యంగా ముదు రోజుల పాటు వైభవంగా కుంభాభిషేకం రోజు వారి కార్యక్రమాలల్లో ఏర్పాటు చేశారు. అందులో మొదటి రోజు గ్రామ కట్టు గాలురాల్ల ప్రతిష్ఠం,రెండొవ రోజు గణపతి హోమాలు ,ముడవ రోజు గ్రామ దేవత శ్రీ మోలక వేమా లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్నారు.ఈ గ్రామ దేవత కుంభాభిషేకానికి నలమూలల ప్రాంతాలే కాక చెన్నై,బెంగళూరు తదితర రాష్ట్రాల నుండి కూడా అమ్మవారి భక్తులు వచ్చి వారి మొక్కులను చెల్లించుకుంటారు

## ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించిన జోనల్ చైర్మన్

వాకాడు, జూన్ 3, ప్రభాతవార్త



వాకాడు మండల కేంద్రంలో ఉన్న ఏపీఎస్ఆర్టీసీ డిపో బస్టాం డ్‌ను మంగళవారము ఏపీఎస్ ఆర్టీసీ డైరెక్టర్ అండ్ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసారు. డిపో గ్యారేజ్ని, ఆర్టీసీ బస్టాం డ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధించిన స్థానిక నేతలు ఆర్టీసీ బస్టాండ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ ఆవరణలోని త్రాగునీటి, విద్యుత్, మరుగుదొడ్డులు పలు రకాలైన సమస్యలు ఉన్నాయని, బస్టాండ్‌లోని ఉన్న రోడ్డు గుంతల మయంగా సమస్య, బస్టాండ్‌లోని సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వర్షం వచ్చినప్పుడు బస్టాండ్లో ఉరవడం పలు సమస్యలు స్థానిక నేతలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి స్పందించి బస్సులు బస్టాండ్‌కి రావాలని, డిపో మేనేజర్ పనితీరు మారకుండా ఉంటే చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని సత్కరించారు. డిపో మేనేజర్ మీద ఆయన మండిపడ్డాడు. ఆయన వెంట బిజెపి నాయకులు పనబాక కోటేశ్వరరావు, శరత్ చంద్రారెడ్డి, రమేష్, సంపత్ కుమార్, మల్లి ప్రసాద్, డిపో మేనేజర్ పెంచలయ్య, ఆర్టీసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గ్రామీణ ప్రాంతంలో మెరిసిన విద్యా కుసుమం



చిట్టమూరు, జూన్ 3 ప్రభాతవార్త

దేశంలోని ప్రఖ్యాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లలో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాలు , సోమవారం విడుదల య్యాయి. ఈ ఏడాది పరీక్షల నిర్వహణ బాధ్యతను ఐఐటీ కాన్పూర్ చేపట్టింది. దేశవ్యాప్తంగా అత్యంత పోటీ ఉండే ఈ ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు లక్షల మంది విద్యార్థులు పోటీ పడ్డారు.ఈ ఏడాది మే 18న రెండు పేపర్లలో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 1,80,422 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 54,378 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు ఐఐటీ కాన్పూర్ ప్రకటించింది. సబ్జెక్టుల వారీగా, మొత్తం మీద నిర్దేశిత కనీస కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులను మాత్రమే ర్యాంకుల జాబితాలో చేర్చినట్లు అధికారులు తెలిపారు. వివిధ కేటగిరీలకు సంబంధించిన కనీస కటాఫ్ మార్కుల వివరాలను కూడా విడుదల చేశారు. నేపథ్యంలో చిట్టమూరు మండలంలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన నాగరాజు సునంద కుమార్తె అద్దూరు స్మాటి విజ్ఞాపిక ఆల్ ఇండియా 3165 ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు పలువురు విద్యార్థినికి శుభాభినందనలు తెలియజేశారు. విద్యార్థిని తండ్రి నాగరాజు వృత్తిరీత్యా వ్యవసాయం చేసుకోవడంతో పాటు ఓ ప్రముఖ పత్రికలో విలేకరుగా పనిచేస్తుండగా, తల్లి సునంద వ్యవసాయ శాఖలో సచివాలయ ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థిని ప్రాథమిక ఉన్నత చదువులు నాయుడుపేట మండలం బిరదవాడలోని అంబేద్కర్ గురుకులంలో ఎస్ఎస్సి పూర్తి చేసి ఇంటర్ విద్యను నెల్లూరులోని నారాయణ కళాశాలలో చదివి ఆల్ ఇండియా ఎస్సీ క్యాటగిరిలో ర్యాంక్ సాధించడం విద్యార్థిని ప్రతిభకు నిదర్శనం కాగా నారా యణ అధ్యాపక బృందం ఇచ్చిన గైడెన్స్, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని విజ్ఞాపిక సందర్భంగా తెలియజేశారు.

## వైసీపీ నేత హరినాధ రెడ్డిని పరామర్శించిన నేతలు

ఓజిలి, జూన్ 3 ప్రభాతవార్త



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరి నాధరెడ్డిని మంగళవారం నాయుడుపేట మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, పలువురు వైసీపీ నేతలు పరామర్శించారు. పాదర్తి హరినాథ్ రెడ్డి ఇటీవల తన ఇంటిలో పడి చెవికి గాయమైంది.ఆయన హాస్పిటల్లో చికిత్స చేయించుకుని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న వైసిపి నేత, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్, వైసీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ షబ్బీర్, వైసిపి నాయకులు ముత్యాల రెడ్డి, తన్నమాల రమణయ్య సుబ్రహ్మణ్యం యాదవ్ తదిత రులు నాయుడుపేట పట్టణంలోని హరినాథ్ రెడ్డి నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు.

## ప్రజలకు వెన్నుపోటు పొడిచింది జగన్‌రెడ్డే

### - మండల టిడిపి అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు

ఓజిలి, జూన్ 3, ప్రభాతవార్త



గత ఐదేళ్లు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిన జగన్ నేడు వెన్నుపోటు దినోత్సవం పేరుతో నిరసనలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని ఓజిలి మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గుజ్జులపూడి విజయ్ కుమార్ నాయుడు అన్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనను ప్రజలు కూకటివేళ్లతో పెకలించిన రోజు జూన్ 4 అని ప్రజా తీర్పును వెన్నుపోటు అనడం సిగ్గుచేటు అన్నారు. గత ఐదేళు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచింది జగనేనని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైసీపీ నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని ప్రజలు హర్షించరని ప్రజా మద్దతును కోల్పోతుందన్నారు. ప్రజాహితంతో అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆయన పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఏపీ సర్వనాశనం అయిందని గండి బాబ్జి విమర్శించారు. పెన్షన్ రూ. 4 వేలు చేసింది కూటమి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని ప్రకటించారు. జగన్ హయాంలో అమరావతిని సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు.

## ఘనంగా హాషిం హుస్సేని బాబా గంధమహోత్సవం

గూడూరు, జూన్ 3, ప్రభాతవార్త



పట్టణంలో వెలసినటువంటి హజరత్ సయ్యద్ హాషిమ్ హుసైని రహమతుల్లా అలై వారి గంధ మహోత్సవం సోమవారం రాత్రి మత గురువుల ప్రార్థనలతో ఫకీర్ల జరబు విన్యాసాలతో భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. ముందుగా హజరత్ సయ్యద్ హాషిం హుస్సేనీ వారి గంధము దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ ఇంటి నుండి ప్రార్థనల అనం తరం గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చి మత గురువుల పీఠాధిపతుల ప్రత్యేక ప్రార్థనలు దువా అనంతరం హజరత్ సయ్యద్ హాషిమ్ హుస్సేని బాబా వారి సమాధికి గంధ లేపనం జరిపారు. షేక్ తాహిర్ ఆధ్వర్యంలో దర్గా కమిటీ పర్యవేక్షణలో అన్నదాన కార్య క్రమాన్ని నిర్వహించారు. దర్గా ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్‌లు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో హజ్రత్ వారి గంధమహోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. దర్గా ప్రధాన ముజావర్ మత గురువు మగ్దూమ్ అలీషా మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో నిర్వహించే గంధ మహోత్సవంలో విచ్చేసిన చెన్నై, తిరుపతి, నెల్లూరు, గూడూరు మత గురువులకు నందవరం నుండి విచ్చేసిన ఫకీర్ల బృందానికి దర్గా గంధ మహోత్సవానికి సహకరించిన వారు బాగుండాలని ప్రార్థనలు నిర్వహించామని తెలిపారు. దర్గా అధ్యక్షులు రియాజ్ అహ్మద్ గౌరవ అధ్యక్షులు లయన్ షేక్ రియాజ్ అహ్మద్ దర్గా కమిటీ సభ్యులు షిరాజ్ అహ్మద్, షాన్వాజ్, ఇలియాజ్ అహ్మద్,ముజమ్మిల్, యస్దాని, సంధాని భాష, షబ్బీర్, సైదులు, గోల్డెన్ గౌస్, నయీమ్ మత గురువులు మగ్దూమ్ అలీషా, దిల్దార్ అలీషా భాసిత్, ఖమర్ అలీషా, రెహమాన్ అలీషా, మస్తాన్ ఖాదరి, సలీం చిష్తి, మజహర్ అలీషా, గౌస్ అలీషా ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వం

### మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు

వెంకటగిరి, జూన్ 3, ప్రభాతవార్త

వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మాజీ ఏఎంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు తెలిపారు. వెంకటగిరిలోనే ఎమ్మెల్యే నివాస గృహంలో టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని తెలిపారు. పేదలకు ఇచ్చే పెన్షన్ను ఐదు సంవత్సరాలు పాటు కొద్దికొద్దిగా పెంచుతూ చివరి సంవత్సరంలో మొత్తం ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులకు 4000 రూపాయలను ఇచ్చిందని తెలిపారు. ఉచిత గ్యాస్ సిలిండర్స్ ఇస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్ మాట్లాడుతూ వెన్నుపోటు చరిత్ర కలిగింది వైసీపీ దేనని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళి రెడ్డి, నాయకులు సత్యనారాయణ, ఆనంద్, బాబు నాయుడు, రాజేశ్వరరావు, వెంకట ముని, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## 2019 ఎన్నికల కేసులో 10మంది టిడిపి నేతలకు విముక్తి

తిరుపతి,జూన్ 3ప్రభాతవార్త:



20119లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ దురుద్దేశంతో ప్రచారానికి ఎన్నికల అధికారుల వద్ద అనుమతితీసుకోలేదని నమోదైన కేసులో టిడిపి నేతలు 10మందికి విముక్తి కలిగింది. 2వ అదనపు న్యాయమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. సుగుణమ్మ, పనబాకలక్ష్మి, వి.పుష్పావతి యాదవ్, డాక్టర్ సుధారాణి, ఆర్‌సి మునికృష్ణ, నరసింహయాదవ,కృష్ణయాదవ్, డాక్టర్ ఆశాలత తదితరులను ఈ కేసులో 10మందిని నిర్దోషులుగా తేల్చి కేసును కొట్టివేశారు.

## తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని కలిసిన క్రెడాయ్ ప్రతినిధిలు

తిరుపతి కార్పొరేషన్, జూన్ 3, ప్రభాతవార్త



తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని మంగళవారం తుడా కార్యాలయంలో క్రెడాయ్ ప్రతినిధిలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు అందజేసి దుస్సాలువులతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. తమ క్రెడాయ్ సభ్యులైన డాలర్స్ దివాకర్ రెడ్డి తుడా చైర్మన్‌గా నియమితుల వడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి నగరం నెక్స్ట్ లెవెల్‌కి వెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతి నగర అభివృద్ధిలో తుడాతో కలిసి క్రెడాయ్ కూడా పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ చైర్మన్ గోపీనాథ్, అధ్యక్షులు రాంప్రసాదరావు, ఉపాధ్యక్షులు రాజేష్, కార్యదర్శి నరసింహారెడ్డి, ట్రెజరర్ హరికృష్ణ, సభ్యులు స్వరూప్, ప్రభాకర్, నీలేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి - మాజీ మంత్రి రోజా

పుత్తూరు రూరల్,జూన్ 3 ప్రభాతవార్త:



వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం ద్వారా ప్రభుత్వం వైఫల్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మాజీ మంత్రి రోజా పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాస కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర జిల్లా కమిటీల సభ్యులు, నియోజకవర్గ, మున్సిపల్ మండల పార్టీ కమిటీల కార్యవర్గ సభ్యులు, అనుబంధ కమిటీ కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులతో సమావేశమైంది. ఆమె బుధవారం చేపట్టే వెన్నుపోటు దినం కార్యక్రమంపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరిట హామీలు ఇచ్చి ఏడాది పూర్తయినా ఏదీ పాలక ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. గతంలో మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథంతా ఉంటే నేడు అది చిత్తు కాగితంలా మారిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌లు, ఎంపీపీలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీ, అనుబంధ కమిటీల సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ముచ్చటగా మూడవవారం మొక్కులు

### చల్లంగా చూడమ్మా గంగమ్మా!



తిరుపతి,జూన్ 3ప్రభాతవార్త:

తిరుపతినగరగ్రామదేవత తాతయ్యగుంటగంగమ్మ జాతర అనంతరం మూడవవారం మంగళవారం రాయలసీమ రంగస్థలి కళాకారులు వేషధారణలతో మొక్కులు తీర్చుకున్నారు. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వివిధ రకాల సాంప్రదాయ వేషధారణలతో గంధంవేషాలతో జేజేలు పలుకుతూ మంగళవాయిద్యాల నడుమ గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఇక్కడ అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కళాకారులు మురళీకృష్ణ, వెంకటాచార్యులు, వినోద్‌కుమార్, గురుతేజా, రమణారెడ్డి, కృష్ణయ్య, పొన్నాలజేజిరెడ్డి, తొండమనాటిసుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరావు, సాయిదత్త పాల్గొన్నారు.

## వెన్నుపోటుకు..గొడ్డలిపోటుకు పేటెంట్ మీదే జగన్

### - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూన్ 3 ప్రభాతవార్త

వెన్నుపోటుకు, గొడ్డలిపోటుకు పేటెంట్ హక్కు మాజీ సిఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలకు, రాజధాని అమరావతి నగరానికి తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. అందుకే జనం ఓటుపోటుతో జగన్‌ను కేవలం 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధిచెప్పారన్నారు. అధికారంలో వచ్చేందుకు మద్యనిషేధం, జాబ్‌కేలండర్ వంటి హామీలు ఇచ్చి చివరకు వాటిని అమలు చేయక వెన్నుపోటుపొడిచారన్నారు. మద్యం కుంభకోణం సైతం వెలుగుచూస్తోందన్నారు. రాష్ట్రాన్ని పది లక్షల కోట్ల అప్పుల్లో నింపేశారన్నారు. కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఎందుకు వెన్నుపోటు దినం జరుపుతున్నారో చెప్పాలన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ సొంత తల్లి విజయమ్మ, చెల్లి వైఎస్ షర్మిలను వెన్నుపోటు పొడిచింది జగనేన్నారు. సొంత బాబాయ్‌పై గొడ్డలిపోటు జరిగిందన్నారు. జగన్ డ్రామాను ప్రజలు విశ్వసించే స్థితిలో లేరన్నారు.

## కన్నుల పండువగా బంగారమ్మ జాతర

తొట్టంబేడు,జూన్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కైలాసగిరికి సమీపంలోని బంగారమ్మ ఆలయంలో జాతర సంబరాలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. మంగళవారం ఉదయం ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులు సారెను అందించారు.ఈ సందర్భంగా భారీ ఎత్తున కమిటి నిర్వాహకులు ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా పలువురు వేషాలు ధరించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని జాతర సందర్భంగా సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. అలంకారాలు దద్దరిల్లాయి. ఉదయం ఆలయంలోని మూలవిరాట్టు అమ్మవారికి విశేష అభిషేకాలతో జాతర సంబరాలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి అంబళ్ళు సమర్పణ వితరణ కార్యక్రమాలు జరిగాయి.

### సారె బహూకరణ:

1999 నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చేసిన బంగారమ్మ ఆలయంలో జాతర సంబరాలను ఘనంగా నిర్వహించుటకు చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్యకు ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశించారు. దాంతో భక్తులు,కమిటి మనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేసారు. దేవస్థానం నుంచి సారెను అంగరంగ వైభవంగా తీసుకొచ్చారు. సారె తెచ్చిన కృష్ణారెడ్డి దంపతులు,ఎఇఓ హేమామాలిని, సూపరింటెండెంట్ రవి,లక్ష్మయ్యలు హాజరు కాగా స్థానిక ఆచారంమేరకు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాధికారులు గెరిగే ఉత్సవంతో పాటు పాల్గొన్నారు.

## గంగవరంలో ఘనంగా గంగజాతర



గంగవరం, జూన్ 3 ప్రభాతవార్త :

మండల కేంద్రం గంగవరంలో గంగమ్మ జాతరను ఘనంగా జరుపుకున్నారు.మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సును గ్రామ పొలిమేరు నుంచి భారీ ఎత్తున బాణాసంచా,మేళతాళాల మధ్య శిరస్సును గ్రామ పుర వీధులలో ఊరేగించి నడి వీధిలో ప్రతిష్టించారు.మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్ళు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.సాయంత్రం దూపదీప నైవేద్యాలతో ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలిచారు.ఆదివారం గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కు బడులుచెల్లించుకున్నారు.బుధవారం ఉదయం అమ్మవారి జలధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.